మళ్లీ ఆదాయానికి గండి!

- బిల్డింగ్ ప్లాన్‌పై 14 శాతం సిటీ డెవలప్‌మెంట్ చార్జీల వసూలుపై కుట్ర
- 1984 ముందు వాటికి చార్జీల నుంచి మినహాయింపు
- 2017 నుంచి 2022 వరకు 930పైగా ధ్రువపత్రాలు జారీ
- భారీగా ట్యాంపరింగ్ చేసి తప్పుడు ధ్రువ పత్రాలు ఇచ్చినట్లు ఆరోపణలు
- 2023 నుంచి రికార్డ్ రూము నుంచి ఎటువంటి ధ్రువ పత్రాలు ఇవ్వని అధికారులు
- తాజాగా మళ్లీ రికార్డు రూమ్ నుంచి ధ్రువ పత్రాలు ఇస్తున్న అధికారులు


నగరపాలక సంస్థ కార్యాలయం

నెహ్రూనగర్: కార్పొరేషన్ ఆదాయానికి గండి కొడుతున్నారు. నగరంలో చేపట్టే ప్రతి భవన నిర్మాణానికి తప్పనిసరిగా ప్లాన్ అవసరం. ఆ ప్లాన్ తీసుకోవాలంటే భవన నిర్మాణానికి బట్టి చార్జీలు చెల్లించాలి. ఇందులో ప్రధానంగా 14 శాతం సిటీ డెవలప్‌మెంట్ ఫండ్ ఉంది. అయితే ఇందులో 1984 ముందు ఇంటి పన్ను ఉన్నట్లుగా రికార్డ్ రూం నుంచి సరైన అసెస్‌మెంట్ నంబర్‌తో పన్ను ఉన్న ధ్రువీకరణ పత్రం తీసుకుంటే 14 శాతం సీడీఎఫ్ చార్జీల నుంచి మినహాయింపు ఉంది. 2017 నుంచి 2022 వరకు 900కి పైగా రికార్డు రూము నుంచి 14శాతం సీడీఎఫ్ చార్జీల మినహాయింపు కోసం భవన యజమానులు ధ్రువ పత్రాలు తీసుకున్నారు. వందల సంఖ్యలో తప్పుడు పత్రాలు తీసుకుని కార్పొరేషన్ ఆదాయానికి గండి కొట్టారు.

అప్పట్లోనే వివాదం..

2022లో దీనిపై తీవ్ర వివాదం రేగడంతో అప్పుడు రికార్డ్ రూములో పనిచేస్తున్న సిబ్బందిని వేరే సెక్షన్‌కు బదిలీ చేశారు. రికార్డ్ రూము నుంచి 14 శాతం సీడీఎఫ్ చార్జీలకు సంబంధించి ఎటువంటి ధ్రువ పత్రాలు ఇవ్వవద్దని అప్పటి కమిషనర్ కీర్తి చేకూరి 2023లో ఆదేశాలు జారీ చేశారు. దీంతో అప్పటి నుంచి ఎటువంటి ధ్రువ పత్రాలు రికార్డ్ రూము నుంచి ఇవ్వడం లేదు. తాజాగా వీటికి మళ్లీ రెక్కాలొచ్చాయి. 14శాతం సీడీఎఫ్ చార్జీల నుంచి మినహాయింపు కోసం దరఖాస్తులు రావడంతో రికార్డ్ రూము నుంచి 1984కి ముందు పన్ను ఉన్నట్లు ధ్రువ పత్రాలు జారీ చేస్తున్నారు.

ముడుపులు ఇవ్వాల్సిందే?

ప్రస్తుతం నగరంలో 14 శాతం సీడీఎఫ్ మినహాయింపు కోసం రికార్డ్ రూము నుంచి సుమారు 15కిపైగా ధ్రువ పత్రాలు ఇచ్చినట్లు సమాచారం. ఈ ధ్రువ పత్రాలు ఇవ్వాలంటే ప్రతి అధికారికి పలానా అమౌంట్ ఇవ్వాలని కార్యాలయ సిబ్బంది చెప్పడంతో నగరపాలక సంస్థ కార్యాలయంలో చర్చనీయాంశంగా మారింది.

రికార్డ్ ఉంటేనే 14శాతం మినహాయింపు

14శాతం సీడీఎఫ్ చార్జీలకు దరఖాస్తులు వస్తున్నాయి. వాటికి సంబంధించి రికార్డ్ రూములో రికార్డ్స్‌లో 1984కి ముందు పన్ను ఉన్నట్లు స్పష్టంగా రికార్డ్స్ ఉంటే నేనే స్వయంగా పరిశీలించి ధ్రువపత్రాలు జారీ చేస్తున్నాం. ఎటువంటి రికార్డు లేకపోతే ధ్రువ పత్రం ఇవ్వడం లేదు.

– చల్లా ఓబులేసు, అదనపు కమిషనర్

రెండేళ్ల తరువాత పత్రాలు ఇవ్వడంపై అనుమానాలు?

రెండేళ్ల క్రితం నిలిపివేసిన 14 శాతం సీడీఎఫ్ ధ్రువపత్రాలు ఇప్పుడు మళ్లీ ఇవ్వడంపై పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి. ఈ రెండేళ్లలో నగరంలో వేల సంఖ్యలో భవన నిర్మాణాలను అనుమతులు మంజూరు చేశారు. అందులో 14 శాతం సీడీఎఫ్ చార్జీలు కట్టించుకుని ఇచ్చారు. తాజాగా ఇప్పుడు 14శాతం మినహాయింపు కోసం దరఖాస్తులు వస్తున్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. కొంత మంది అధికారులు, సిబ్బంది అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి ఇప్పుడు మళ్లీ ధ్రువపత్రాలు ఇస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

డ్రెయిన్లపై ఆక్రమణలు తొలగించాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు


డ్రెయిన్ నిర్మాణ వివరాలను తెలుసుకుంటున్న కమిషనర్

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో అభివృద్ధి పనుల్లో భాగంగా డ్రెయిన్ల నిర్మాణాలు జరుగుతున్న ప్రాంతాల్లో పట్టణ ప్రణాళిక అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఆక్రమణలను పూర్తిగా తొలగించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం కమిషనర్ చుట్టుగుంట జంక్షన్ నుంచి పీకలవాగు వరకు చేపట్టిన డ్రెయిన్ నిర్మాణ పనులను, చౌడవరం, జూనం చుండూరు తదితర ప్రాంతాల్లో అభివృద్ధి, పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్రధానంగా రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణ పనులు జరుగుతున్న ప్రాంతాల్లో ఆక్రమణల వలన పనుల్లో జాప్యం జరుగుతుందని చెప్పారు. పట్టణ ప్రణాళిక అధికారులు ఆయా ప్రాంతాల్లో ఆక్రమణల తొలగింపునకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. చుట్టుగుంట జంక్షన్ నుంచి పీకల వాగు వరకు చేపడుతున్న మేజర్ డ్రెయిన్ చాలా కీలకమని, మాస్టర్ ప్లాన్ మేరకు ఆక్రమణలు పూర్తిగా తొలగించి పనులు చేపట్టాలని ఆదేశించారు. చుండూరులో స్థానిక హిందూ శ్మశానవాటికలో ప్రహరీ, వాచ్‌మెన్ రూమ్, దహన వాటిక నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేసినందున వాటిని తదుపరి ఆమోదానికి పంపాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. శివారు ప్రాంతాల్లో పారిశుద్ధ్య సమస్యలపై ఫిర్యాదులు అందుతున్నాయని, ఆయా ప్రాంతాలలో పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. పర్యటనలో డీఈఈలు వెంకటరమణ, సతీష్, ఏసీపీ వెంకటేశ్వర్లు, ఎస్ఎస్ రాజేష్ పాల్గొన్నారు. మిర్చియార్డు దగ్గరలోని అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. అన్న క్యాంటీన్‌లలో ప్రతి రోజు నిర్దేశిత సమయానికి ఆహారాన్ని అందించాలని నగర కమిషనర్ అక్షయ పాత్ర సిబ్బందిని ఆదేశించారు.

ప్రతి ఒక్కరూ బృంద స్ఫూర్తితో నేరాలు ఛేదించాలి


సీఐ, ఎస్ఐ, సిబ్బందిని అభినందిస్తున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

నగరంపాలెం: జిల్లాలోని పోలీస్ అధికార, సిబ్బంది బృంద స్ఫూర్తితో పనిచేసి, నేరాలను నియంత్రించాలని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. ఇటీవల నల్లపాడు పీఎస్ పరిధిలో బంగారు గొలుసులు, బైక్ చోరీలు, హత్యలు, ఇతరత్రా నేరాలను ఛేదించిన నల్లపాడు పీఎస్ సీఐ వంశీధర్ బృందాన్ని శనివారం నగరంపాలెం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ప్రత్యేకంగా అభినందించారు. సీఐ వంశీధర్, ఎస్ఐ నారాయణరెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ సుబ్బారావు, కానిస్టేబుళ్లు మస్తాన్, భిక్షునాయక్, సాంబశివరావు, వెంకటేశ్వర్ల ప్రతిభను అభినందించి, ప్రశంస పత్రాలను జిల్లా ఎస్పీ అందించారు. నేరాల ఛేదనలో నిరంతరం శ్రమించి, బాధితులకు న్యాయం అందించారని అన్నారు. కార్యక్రమంలో దక్షిణ డీఎస్పీ జి.భానోదయ పాల్గొన్నారు.

పోలీస్ కుటుంబాలకు చెక్కులు పంపిణీ

నగరంపాలెం: పోలీస్ కుటుంబాలకు అన్నివేళల్లో అండగా ఉంటామని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. ఇటీవల ఏఆర్ ఎస్ఐ చిలక రత్నం, ఏఆర్ హెచ్‌సీ జి.శ్రీనివాసరావు, మహిళా ఏఎస్ఐ లింగ అనంతలక్ష్మి వేర్వేరుగా అనారోగ్య కారణాలతో మృతి చెందారు. ఈ మేరకు ఆయా కుటుంబాల సభ్యులకు లక్ష రూపాయల చెక్కులను శనివారం నగరంపాలెం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అందించారు. కార్యక్రమంలో వెల్ఫేర్ ఆర్ఐ సురేష్, జిల్లా పోలీస్ అసోసియేషన్ కోశాధికారి హుస్సేన్, కార్యదర్శి లక్ష్మణ్, సభ్యులు కరిముల్లా, డీపీఓ మహిళా సిబ్బంది నాగరాణి పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యారంగ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం



గుంటూరు ఎడ్యుకేషన్: విద్యారంగ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సమష్టిగా పోరాటం సాగిస్తామని ఎంజే మాణిక్యరావు మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. శనివారం ఏసీ కళాశాలలో ఎంజే మాణిక్యరావు మెమోరియల్ ట్రస్ట్ సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ట్రస్ట్ నూతన అధ్యక్షుడిగా కేఎస్ లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శిగా ఏసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మోజెస్‌ను ఎన్నుకున్నారు. కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యారంగ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడటంతో పాటు ఎయిడెడ్ విద్యారంగంలో మార్పులను అధ్యయనం సాగించే లక్ష్యాలుగా ట్రస్ట్ పని చేస్తుందని తెలిపారు. సమావేశంలో ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

15న చలో విజయవాడను జయప్రదం చేయండి



లక్ష్మీపురం: ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 15వ తేదీన చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఏఐటీయూసీ నాయకుడు కోటా మాల్యాద్రి తెలిపారు. గుంటూరు చుట్టుగుంటలో ఉన్న శానిటరీ కార్యాలయం వద్ద కార్మికులతో ఆయన మాట్లాడుతూ ఒప్పంద ఇంజినీరింగ్ కార్మికుల కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్రంలోని ఇంజినీరింగ్ కార్మికులతో పాటు గుంటూరు నగరంలోని మున్సిపల్ కార్మికులతో పాటు ఇతర మున్సిపల్ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఇంట్లో చోరీ

పట్నంబజారు: ఇంటిలో చోరీకి పాల్పడిన ఘటనపై కేసు నమోదైంది. పాతగుంటూరు పోలీసులు తెలిపిన వివరాలు.. తమ్మారంగారెడ్డినగర్‌లో నివాసం ఉండే ప్రసన్నకుమారి ఆమె నివాసంలో గత వారం రో జుల క్రితం 20 గ్రాముల నాన్‌తాడును పెట్టారు. అయితే శనివారం గమనించిన క్రమంలో బంగారు గొలుసు కనబడలేదు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

లైబ్రరీ సైన్స్ అధ్యాపకులకు పదోన్నతులు కల్పించాలి

నెహ్రూనగర్: లైబ్రరీ సైన్స్ అధ్యాపకులకు ప్రిన్సిపాల్స్‌గా పదోన్నతులు ఇచ్చిన జీఓ 76ని అమలు చేయాలని మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ ప్రభుత్వానికి విన్నవించారు. శనివారం లైబ్రరీ సైన్స్ అధ్యాపక సంఘ సర్వసభ్య సమావేశం ప్రభుత్వ మహిళ జూనియర్ కాలేజీలో నిర్వహించారు. లైబ్రరీ సైన్స్ అధ్యాపకులకు ప్రిన్సిపాల్స్‌గా పదోన్నతులు మార్చి 12, 2024న ఇచ్చిన జీఓ నంబర్ 76 అమలు చేయాలని సర్వ సభ్య సమావేశంలో తీర్మానించారు. సమావేశంలో సంఘ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.తాతారావు, అసోసియేట్ ప్రెసిడెంట్ ఎస్.రమేష్‌బాబు, సంఘ ఫైనాన్స్ సెక్రటరీ ఎం.వెంకట రంగయ్య పాల్గొన్నారు.

గ్రంథాలయాలను కాపాడుకోవాలి

నగరంపాలెం: ఏ జాతి ప్రగతైనా విజ్ఞానంపై ఆధారపడి ఉంటుందని, విజ్ఞాన నిధులైన గ్రంథాలయాలను కాపాడు కోవాలని మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ అన్నారు. ఏపీ గ్రంథాలయ పునర్వికాస వేదిక ఆధ్వర్యంలో శనివారం నగరంలో 'మేధా మథనం' సభ నిర్వహించారు. సభకు అరసం జాతీయ అధ్యక్షుడు, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారగ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి డొక్కా మాట్లాడుతూ పునర్వికాసమంటే ప్రశ్నించే ఆలోచనా తత్వానికి ప్రతీక అని అన్నారు. ఈ తత్వం సమాజంలో ఉండాలన్నారు. ఈ దిశగా కార్యచరణలో ఉన్న గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక కృషి అభినందనీయమని పేర్కొన్నారు. విప్లవ రచయితల సంఘం పూర్వ అధ్యక్షుడు సి.ఎస్.ఆర్.ప్రసాద్ మాట్లాడుతూ సమాజంలో ప్రాధాన్యతలు మారిపోతున్న తరుణంలో వేదిక నిర్వాహకులు కొత్త విధానాలతో గ్రంథాలయ పునర్వికాస ఉద్యమాన్ని నడపాలని అన్నారు.
విశ్రాంత ఐఏఎస్ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రంథాలయాల పునర్వికాసానికి ప్రణాళికా బద్ధమైన సూచనలు అవసరమని అన్నారు. సభాధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ వరల్డ్ క్లాస్ లైబ్రరీలను అమరావతిలో నిర్మిస్తామని మభ్యపెట్టడం సరికాదని అన్నారు. అక్కడ ఆ స్థాయిలో నిర్మించకపోయిన, ప్రస్తుతం ఉన్న గ్రంథాలయంలోని అనేక భవనాలు శిథిలావస్థకు చేరాయని చెప్పారు. డాక్టర్ కోల్లా రాజమోహన్ మాట్లాడారు. కార్యక్రమంలో కాపు శ్రీనివాస్, పారా అశోక్, కాంగ్రెస్ నేత కొరివి వినయకుమార్, అనువాదకుడు కందిమళ్ల శివప్రసాద్, కథా రచయిత కాట్రగడ్డ దయానంద్, నానా, డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు, వేదిక రాష్ట్ర కన్వీనర్ వల్లూరు శివప్రసాద్, జిల్లా కన్వీనర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు పాల్గొన్నారు.

విద్యతోనే సమాజంలో ఉన్నతి

కిమ్స్ శిఖర హాస్పిటల్స్ వైద్య నిపుణుడు కొల్లి జయకిషన్


మాట్లాడుతున్న డాక్టర్ కొల్లి జయకిషన్

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యతోనే సమాజంలో ఉన్నతస్థాయికి చేరుకోవచ్చునని కిమ్స్ శిఖర హాస్పిటల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ కొల్లి జయకిషన్ అన్నారు. శనివారం పద్మశాలి ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాలుగో వార్షికోత్సవాన్ని రెవెన్యూ కల్యాణ మండపంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జీవీఎస్ రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. డాక్టర్ జయకిషన్ మాట్లాడుతూ సమాజంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ప్రతి ఒక్కరు విద్య నేర్చుకోవడం ద్వారా ఉన్నత స్థితికి ఎదగాలని, పద్మశాలీలు ముందు వరసలో నిలబడాలని సూచించారు. ఆదాయ పన్ను శాఖ అదనపు కమిషనర్ వి.కోటేశ్వరి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో నెలకొన్న పోటీని తట్టుకునే విధంగా విద్యనభ్యసించాలని సూచించారు. ఏవీఆర్ హాస్పిటల్స్ ఎండీ డాక్టర్ అందే వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పద్మశాలీ సంక్షేమం కోసం అసోసియేషన్ కృషి చేయాలని సూచించారు. సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాపతి వెంకటరావు, కోశాధికారి టి.చంద్రశేఖర్ నివేదికలను ప్రవేశపెట్టి చర్చ అనంతరం ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈసందర్భంగా ఇటీవల ఎంబీబీఎస్ సీటు పొందిన ఓ విద్యార్థికి ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా రూ.30 వేలు సమాయాన్ని అందించారు. అదే విధంగా జాతీయ వెయిట్ లిఫ్టింగ్‌లో ద్వితీయ స్థానం పొందిన బిట్రా రోచస్మతికి రూ.30 వేలు, 13 ఏళ్ల విభాగంలో బాలుర షటిల్ బ్యాడ్మింటన్ చాంపియన్ సాధించిన పి.సోమన్‌కు రూ.10 వేలతో పాటు పలువురు విద్యార్థులకు ఆర్థిక సహాయాన్ని అందించేందుకు నిర్ణయించారు. దీంతో పాటు జానపద గేయాల ద్వారా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సాధించిన సోమిశెట్టి సరళ, యోగా ద్వారా గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డు సాధించిన సీహెచ్ వసంత లక్ష్మిని సత్కరించారు. గతేడాది కాలంగా ఉద్యోగ విరమణ, ఉద్యోగోన్నతి పొందిన పద్మశాలీ ఉద్యోగులను సత్కరించారు. కార్యక్రమంలో కిమ్స్ చక్ర కేన్సర్ కేర్ హాస్పిటల్ ఈడీ డాక్టర్ టి.మహతి, ఆంధ్రప్రదేశ్ పద్మశాలి సంఘ రాష్ట్ర కన్వీనర్ జీవీ నాగేశ్వరరావు, కోశాధికారి టి.చంద్రశేఖర్, ఎన్ఐటీ వరంగల్ ప్రొఫెసర్ జీవీఎస్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

పట్నంబజారు: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగకుంటే పీడీ యాక్ట్ ప్రయోగిస్తామని లాలాపేట పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ ఎ.వి.శివప్రసాద్ హెచ్చరించారు. శనివారం లాలాపేట పీఎస్ పరిధిలోని రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్‌హెచ్‌ఓ శివప్రసాద్ మాట్లాడుతూ ఎటువంటి ఘర్షణలు, అసాంఘిక కార్యకలాపాలకు రౌడీషీటర్లు పాల్పడ్డారని తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. మంచి భవిష్యత్ కోసం చక్కటి ప్రవర్తనతో వ్యవహరించాలని సూచించారు. స్థానికుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా చట్టప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌హెచ్‌ఓ శివప్రసాద్

డాక్టర్ అయ్యంగార్ మెమోరియల్ పురస్కారం ప్రదానం


పురస్కారం అందుకున్న విద్వాన్ మురళితో నిర్వాహకులు

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై శనివారం గాయత్రీ మహిళా సంగీత సన్మండలి ఆధ్వర్యంలో గాన కళానిధి వింజమూరి వరదరాజ అయ్యంగార్ జయంతి సంగీత వేడుకలు నిర్వహించారు. వింజమూరి సంధ్య (చెన్నై), త్యాగరాజ సాంస్కృతిక సంఘం ఉపాధ్యక్షులు ఎస్.గిరిజాశంకర్, కార్యదర్శి వల్లూరి కృష్ణకిషోర్, ఆలయ పాలకమండలి ఉపాధ్యక్షులు లంకా విజయబాబు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. సభకు సన్మండలి ఉపాధ్యక్షురాలు డాక్టర్ ఎం.రాజరాజేశ్వరి అధ్యక్షత వహించారు. ప్రముఖ శాస్త్రీయ సంగీత విద్వాంసులు విద్వాన్ ఏఎస్ మురళి(చెన్నై)కి డాక్టర్ వింజమూరి వరదరాజ అయ్యంగార్ మెమోరియల్ పురస్కారం అందించి సత్కరించారు. సభానంతరం ఏఎస్ మురళి శాస్త్రీయ సంగీత కచేరి అలరించింది. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఎం.వై.శేషురాణి, ఉపాధ్యక్షులు డాక్టర్ ఎం.రాజరాజేశ్వరి, మాధవపెద్ది మీనాక్షి, పాటిబండ్ల లలితాదేవి, కార్యదర్శి ఏ.వీ.మంగాదేవి, కోశాధికారి విజయలక్ష్మి పాల్గొనగా, కళాకారులను అతిథులను సత్కరించారు.

సైబర్ మోసానికి గురైతే తక్షణమే ఫిర్యాదు చేయాలి

గుంటూరు ఎడ్యుకేషన్: సైబర్ మోసానికి గురైన తక్షణమే ఫిర్యాదు చేయడం ద్వారా భద్రతాపరమైన చర్యలు చేపట్టేందుకు అవకాశం ఉంటుందని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు సీనియర్ మేనేజర్ ఏఎస్వీ బాలకృష్ణ పేర్కొన్నారు. జేకేసీ కళాశాలలో శనివారం ఐక్యూఏసీ విభాగం ఆధ్వర్యంలో మొబైల్, సైబర్ మోసాలపై అధ్యాపకులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా రీసోర్స్ పర్సన్‌గా పాల్గొన్న బాలకృష్ణ మాట్లాడుతూ సైబర్ క్రైమ్స్‌లో గోల్డెన్ అవర్ ఎంతో కీలకమని, మోసం జరిగిన మొదటి గంట వ్యవధిలో 1930కు ఫోన్ చేయడంతో పాటు సైబర్‌క్రైమ్.కామ్‌కు ఫిర్యాదు చేస్తే ఫలితం ఉంటుందని తెలిపారు. ఎటువంటి మోసమైనా నమ్మకంపైనే ఆధారపడి ఉంటుందని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ పి.గోపీచంద్ మాట్లాడారు. సదస్సులో కళాశాల పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్సార్కే ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సాంబశివరావు, ఐక్యూఏసీ సమన్వయకర్త టీబీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు చేపట్టాలి


అధికారులకు సూచనలు చేస్తున్న డీఎస్పీ రమేష్

పట్నంబజారు: నగరంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టాలని ట్రాఫిక్ డీఎస్పీ ఎం.రమేష్ కోరారు. శనివారం నగరంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ పరిశీలించారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద పరిశీలించి ఇన్ గేట్ వద్ద ఆటోలు, కార్లు రోడ్లపై పార్కింగ్ చేయడాన్ని గమనించారు. ఓల్డ్‌క్లబ్ రోడ్డు, 60 అడుగులరోడ్డుపై వాహనాల పార్కింగ్ వలన ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడడాన్ని తగు చర్యలు తీసుకోవాలని ఈస్ట్ ట్రాఫిక్ ఎస్ఐ రవీంద్రబాబుకు సూచించారు. అదేవిధంగా ఆర్‌కేటీ, హిమని సెంటర్ పరిధిలో రోడ్లపై అడ్డదిడ్డంగా చిరువ్యాపారులు, ఆటోలు పార్కింగ్ చేసి ఉండటాన్ని గమనించి తోపుడు బండ్లను తొలగించాలని ఎస్ఐ మదన్‌మోహన్‌కు సూచించారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట ఉన్న రోడ్లపై సామగ్రిని పక్కకు పెట్టాలని చెప్పారు. అనంతరం శంకర్‌విలాస్ ఫ్లైఓవర్ వద్ద జరుగుతున్న నిర్మాణ పనులను పరిశీలించి ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా డైవర్షన్ తీసుకోవాలని ఒన్‌వే ఏర్పాటు చేసి ట్రాఫిక్ నియంత్రణ చేపట్టాలని ఎస్ఐ సాంబశివరావు నాయక్‌కు బాధ్యతలు అప్పగించారు. పట్టాభిపురం స్వామి థియేటర్ వద్ద డ్రెయినేజీ, అండర్‌గ్రౌండ్ వాటర్ పైపులైను మరమ్మతుల కారణంగా ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించాలని ఎస్ఐ శ్రీహరిని కోరారు. చుట్టుగుంట ప్రాంతంలో డివైడర్ ఏర్పాటుతోపాటు, వ్యాపారులు అక్రమంగా షాపుల వద్ద వాహనాలు పార్కింగ్ చేయడాన్ని గమనించి ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా అధికారులు, సిబ్బంది నిబద్ధతో వ్యవహరించాలని తెలిపారు.

తాగునీటిలో నురగ, మురుగు

- హనుమాన్ నగర్‌లో తాగునీటికి అవస్థలు
- చోద్యం చూస్తున్న నగరపాలక సంస్థ అధికారులు


హనుమాన్ నగర్‌లో తాగునీటి పైప్ లైన్ ద్వారా వస్తున్న మురుగు నీరు

లక్ష్మీపురం: నగరవాసులకు తాగునీటి సమస్య తీరడం లేదు. నిరంతరం పైపులైన్లు మరమ్మతులు చేస్తున్నమని చెబుతున్నా కష్టాలు తప్పడం లేదు. మురికీ వాసన, నురగతో నీరు వస్తున్నాయి. రోగాల బారిన పడే అవకాశం ఉంది. ఇది హనుమాన్ నగర్‌లో దుస్థితి. వివరాలు.. నగరంలోని చుట్టుగుంట పరిసర ప్రాంతాల వద్ద ఉన్న 29వ డివిజన్ హనుమాన్ నగర్‌లో 1వ లైన్ నుంచి 10వ లైన్ వరకు సుమారు 800 కుటుంబాలు నివసం ఉంటున్నాయి. రెండు రోజులుగా తాగునీటి పైప్ లైన్ ద్వారా మురికీ నీరు వస్తోంది. మిర్చి యార్డు సమీపంలో నగరపాలక సంస్థ అధికారులు పనులు చేపట్టిన నేపథ్యంలో పైప్ లైన్‌ల ద్వారా మురుగు నీరు వస్తుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మిర్చి యార్డు వద్ద అభివృద్ధి పనులు నేపథ్యంలో పైపులైన్ కలుషితమై తాగునీటిలో కలుస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. స్థానిక అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేదని స్థానికులు వాపోతున్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి

లక్ష్మీపురం: స్మార్ట్ మీటర్లను బిగించడం వెంటనే నిలుపుదల చేయాలని సీపీఐ నగర కార్యదర్శి కోటా మాల్యాద్రి డిమాండ్ చేశారు. గుంటూరులో శనివారం చంద్ర రాజేశ్వరరావు నగర్ కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో సీనియర్ నాయకులు నూతలపాటి వెంకటేశ్వరరావు, దేవా నాయక్, సభ్యులు చల్ల మరియదాసు, బత్తుల శ్రీను, మస్తాన్ బి, శివమ్మ, ఖాసిం, కరీమున్ పాల్గొన్నారు.

విద్య వ్యక్తిత్వ వికాసానికి పునాది

- ఏఎన్‌యూ మాజీ వీసీ ప్రొఫెసర్ వై.ఆర్.హరగోపాల్ రెడ్డి
- చలపతిలో ఘనంగా 6వ స్నాతకోత్సవం


స్నాతకోత్సవంలో పాల్గొన్న ప్రొఫెసర్ వైఆర్ హరగోపాల్‌రెడ్డి, ఇతర అతిథులు

ప్రత్తిపాడు: విద్య వ్యక్తిత్వ వికాసానికి పునాది అని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ మాజీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ వై.ఆర్.హరగోపాల్ రెడ్డి అన్నారు. గుంటూరు రూరల్ మండలం లాంలోని చలపతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాసూటికల్ సైన్సెస్ కళాశాలలో శనివారం బీఫార్మశీ 2021–25 బ్యాచ్, ఫార్మశీ-డి 2019–2025 బ్యాచ్ విద్యార్థుల స్నాతకోత్సవం అట్టహాసంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్ వై.ఆర్. హరగోపాల్ రెడ్డి, గుంటూరు శ్రావణి హాస్పిటల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు డాక్టర్ పోసాని శ్రీనివాసరావు, కృష్ణా యూనివర్సిటీ విశ్రాంత రిజిస్ట్రార్, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ విశ్రాంత సీడీసీ డీన్ ప్రొఫెసర్ పి.రామిరెడ్డిలు హాజరయ్యారు. ప్రొఫెసర్ హరగోపాల్ రెడ్డి మాట్లాడుతూ విద్యలేని మనిషి పరిపూర్ణ వ్యక్తిగా అభివృద్ధి చెందలేడన్నారు. విద్య లేకపోతే మనిషి ఆలోచనాశక్తి, నైపుణ్యాలు మరియు సామాజిక బాధ్యతల పరంగా లోపభూయిష్టంగా మారతాడని చెప్పారు. చలపతి విద్యాసంస్థల అధినేత వైవీ ఆంజనేయులు, సెక్రెటరీ వై.సుజిత్ కుమార్ అధ్యక్షతన జరిగిన స్నాతకోత్సవంలో కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ నాదెండ్ల రామారావు కళాశాల పురోగతి నివేదికను వివరించారు. 2024–25 విద్యా సంవత్సరంలో బి ఫార్మసీ విభాగం నుండి ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని ఎ.ఉమామహేశ్వరికి, ఫార్మ్‌డి విభాగం నుంచి జి. వెంకట వాగ్దేవిలకు గోల్డ్ మెడల్స్‌ను అందించారు. బీఫార్మసీ విభాగం నుంచి డి.వేళాంగిణి రాణి, ఫార్మాడీ విభాగం నుంచి పి.స్ఫూర్తిశ్రీలకు ఉత్తమ రీసెర్చ్ అవార్డు, బీ ఫార్మసీ విభాగం నుంచి ఎ.వెంకట భువనేశ్వర్, ఫార్మాడీ విభాగం నుంచి ఎం. గాయత్రీలకు ఇన్నోవేషన్ అవార్డులను అందజేశారు.

ఎన్జీరంగా సాహిత్య పురస్కారాలకు ఆహ్వానం

నగరంపాలెం: ఎన్జీరంగా సాహిత్య పురస్కారాల (2025)కు రచయిత్రుల నుంచి కథా సంపుటాలను ఆహ్వానిస్తున్నట్లు ఫౌండేషన్ అధ్యక్షులు జక్కంపూడి సీతారామారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది కూడా 2021–2024 మధ్య ఉభయ తెలుగు రాష్ట్రాలు, రాష్ట్రేతరులు, విదేశాల్లో స్థిరపడిన రచయిత్రులు ముద్రిత సంపుటాలను పోటీలకు పంపించాలని ఆయన సూచించారు. మొదటి బహుమతిగా రూ.10 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.5 వేలు అందిస్తామని పేర్కొన్నారు. కథా సంపుటాలు నాలుగు ప్రతుల చొప్పున డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ , 202, శ్రీ వెంకట సాయి రెసిడెన్సీ, రెండో వీధి, రామయ్య నగర్, ఒంగోలు– 523002కు వచ్చే నెల 9వ తేదీలోగా పంపించాలని తెలిపారు. నవంబర్ 7న గుంటూరులో జరిగే ఆచార్య రంగా జయంతి ఉత్సవాల్లో విజేతలకు బహుమతి ప్రదానంతో పాటు సన్మానిస్తామని ఆయన పేర్కొన్నారు. వివరాలకు జక్కంపూడి సీతారామారావు (9849497739), వెన్నిశెట్టి సింగారావు (93930 15584), కందిమళ్ల సాంబశివరావు (98483 51517) నంబర్లల్లో సంప్రదించాలని ఆయన సూచించారు.

అక్రమాలకు పాల్పడుతున్న కార్పొరేట్ విద్యాసంస్థలు


భాష్యం విద్యా సంస్థల ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

లక్ష్మీపురం: నగరంలో ప్రభుత్వ నిబంధనలను పాటించకుండా భాష్యం విద్యాసంస్థలు సెలవు రోజుల్లో కూడా తరగతులు నిర్వహిస్తున్నారని ప్రశ్నించిన ఎస్ఎఫ్ఐ విద్యార్థి నాయకులపై భాష్యం యాజమాన్యం, దౌర్జన్యానికి దిగడం సరి కాదని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు షేక్ సమీర్, నగర కార్యదర్శి యశ్వంత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గుంటూరు నగరంలో భాష్యం విద్యాసంస్థలు పాఠశాలలు, కళాశాలలు సెలవు దినాలలో కూడా నిబంధనలకు వ్యతిరేకంగా తరగతులు నిర్వహిస్తుండటంతో శనివారం ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘ నాయకులు ఆందోళనకు దిగారు. కళాశాల ముందు కొద్ది సేపు నిరసన వ్యక్తం చేశారు. కళాశాల యాజమాన్యాన్ని విద్యార్థి సంఘ నాయకులు నిలదీయగా పోలీసులతో కలిసి యాజమాన్యం నిరసనకారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో కొద్దిసేపు విద్యాసంస్థల ఎదుట నినాదాలతో హోరెత్తింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భాష్యం విద్యా సంస్థల యాజమాన్యం ఇలా విద్యార్థులను మానసికంగా ఇబ్బంది పెట్టే పనులు చేస్తున్నా ప్రభుత్వం ఏ విధంగా కూడా పట్టించుకునే పరిస్థితి కనిపించడం లేదన్నారు. ప్రతి ఆదివారం, రెండో శనివారాలు పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ఇవ్వాలని, లేకపోతే విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలోఁ సహాయ కార్యదర్శి షంషీర్, నగర ఉపాధ్యక్షులు సుభాని, రాకేష్ కమిటీ సభ్యులు నాగ ప్రవీణ్, ఆరిఫ్, ఇర్ఫాన్, గోపి, సుజిత్, మహమ్మద్ నాసిర్, గిరీష్, అన్వర్, భాను, అభి పాల్గొన్నారు.